పత్రికాప్రకటన                                                                 కాకినాడ, ఏప్రిల్ 30, 2018.

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

–మీకోసం ప్రజావాణిలో జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా.

మీకోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వివిధ సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలక్టర్ కార్తికేయ మిశ్రా వివిధ శాఖల అధికారులను అదేశించారు. సోమవారంనాడు కాకినాడ కలక్టరేట్‌లో జరిగిన మీకోసం ప్రజావాణిలో ప్రజల నుండి వివిధ సమస్యల పై వచ్చిన అర్జీలను కలక్టర్ స్వీకరించారు. కోటనందూరు మండలం కె.ఇ.చిన్నయ్యపాలెంకు చెందిన సిహెచ్ శివ కుమారి గత డిసెంబర్ నెలలో కామనగరువు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం జాయిన్ అయ్యానని, ఆ సమయంలో ఆపరేషన్ అనంతరం ఎక్కించిన రక్తం మూలంగా అనారోగ్యం పాలయ్యానని, అప్పటి నుండి అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, వైద్యం చేయించుకునే స్తోమత తనకు లేదని కలక్టర్‌కు విజ్ఞప్తి చేయగా, ఈ మేరకు యన్.టి.ఆర్.ఆరోగ్య సేవ ద్వారా వైద్యం అందించాలని కలక్టర్ సూచించారు. కాకినాడ డివిజన్‌లోని యు.కొత్తపల్లి మండలంలో పట్టాల పంపిణీ పై వచ్చిన ఫిర్యాదుల పై కలక్టర్ స్పందిస్తూ ఈ ఫిర్యాదు పై దర్యాప్తు చేయాలని తహశీల్దార్‌ను కలక్టర్ ఆదేశించారు. మీకోసం ప్రజావాణి వేదికలో ప్రజల నుండి వచ్చిన పలు విజ్ఞప్తులను కలక్టర్ స్పందిస్తూ ఈ సమస్యలు సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని, సమస్యలపై తీసుకున్న చర్యలను సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలన్నారు. ఈ ప్రజావాణిలో ప్రజల నుండి కుటుంబ సమస్యలు, భూవివాదాలు, పింఛన్లు మంజూరు, ఇళ్ళ స్థల పట్టాల కొరకు కలక్టర్‌కు విజ్ఞాపనలు అందజేసారు. వేసవి అయినప్పటికీ జిల్లాలోని పలు ప్రాంతాల నుండి అర్జీదారులు తమ సమస్యల పరిష్కారం కోసం కలక్టరేట్‌కు తరలివచ్చారు. అర్జీదారుల కోసం కలక్టరేట్ ప్రాంగణంలో త్రాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. వికలాంగులు, వయోవృద్ధుల నుండి దరఖాస్తులు స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సోమవారంనాడు జరిగిన మీకోసం ప్రజావాణిలో సుమారు 300 అర్జీదారులు తమ అర్జీలను కలక్టర్‌కు, జాయింట్ కలక్టర్‌కు అందజేశారు. తుని మండలం వల్లూరుకు చెందిన ఒక మహిళ తన భర్త హింసిస్తున్నాడని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని కలక్టర్‌ని కోరగా, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ పిడిని కలక్టర్ ఆదేశించారు. కోరుకొండ మండలం గుమ్మళ్ళదొడ్డిలో లబ్దిదారులకు ల్యాండ్ సీలింగ్ ద్వారా అందచేసిన భూములు ఆక్రమణలకు గురయ్యాయని, తమకు న్యాయం చేయాలని కోరగా, రాజమహేంద్రవరం సబ్-కలక్టర్ విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలక్టర్-2 జె.రాధాకృష్ణమూర్తి కూడా ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఇంద్రపాలెం శ్రీనివాసనగర్‌లో కొంత మంది గంజాయి వ్యాపారులు తమకు ఇబ్బంది కలిగిస్తున్నారని ఫిర్యాదు చేసారు. అదే విధంగా కాజులూరులో చేనేత కార్మికులు పడుగు సైజింగ్ స్థలంలో మోటార్లు పార్కింగ్ చేస్తున్నారని, దీని మూలంగా చేనేత కార్మికులకు జివనోపాధి దిబ్బతింటుందని, దీని పై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉండూరు గ్రామానికి చెందిన మోర్తా భూషణం తన గృహానికి పంచాయతీ పన్ను వేయాలని , విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని జేసిని కోరారు.

**డాట్ డ్రాయింగ్ విద్యార్థికి పారితోషికం :-**

అనపర్తి మండలం రామవరంలోన నల్లిమిల్లి మూలారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బొంఠం గణేష్ డాట్ డ్రాయింగ్‌లో చూపిన ప్రతిభ పై సాధించిన రికార్డులను కలక్టర్ కార్తికేయ మిశ్రా సోమవారంనాడు జరిగిన మీకోసం ప్రజావాణిలో అభినందించారు. ఈ విద్యార్థి నాలుగు వరల్డ్ రికార్డులు, 3 స్టేట్ రికార్డులు పొందాడని ఉపాధ్యాయుడు మందపల్లి సత్యం తెలిపారు.

ఈ ప్రజావాణీ కార్యక్రమంలో డిఆర్ఓ ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )